క్లుప్తంగా

రీసర్వేపై అవగాహన ర్యాలీ


రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకోడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీసర్వే ప్రాజెక్టుపై అవగాహన ర్యాలీని మంగళవారం శృంగవృక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దారు ఎస్.భారతీవిజయలక్ష్మి రెవెన్యూ పరంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ రీసర్వేను నిర్వహిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగం సూరిబాబు, మాజీ ఉపసర్పంచ్ కలిదిండి కృష్ణంరాజు (బుజ్జి), నాయకులు, అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ


గాత్ర కచేరీ చేస్తున్న డీబీ అశ్విన్

భీమవరం(ప్రకాశం చౌక్): త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం చెన్నైకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు డీబీ అశ్విన్ గాత్ర కచేరి అందరిని అలరించింది. సుమారు మూడు గంటలపాటు సంగీత కచేరి చేశారు. సహ వాయిద్యకారులుగా మద్రాసుకు చెందిన నందకుమార్, శ్రీరామ్ వయొలిన్, మృదంగంతో సహకరించారు. కార్యక్రమంలో చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, గన్నాబత్తుల శ్రీనివాస్, గంధం విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించాలని తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: ఉప్పుగుంట రోడ్డులో ఉన్న శ్మశాన వాటికలో చెత్తా, చెదారాన్ని తొలగించి అంత్య క్రియలకు ఆటంకం లేకుండా చూడాలని సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం నడిరోడ్డుపై దహన సంస్కారాలు నిర్వహించిన మీదట దీనిపై చర్యలు తీసుకుని శ్మశానంలో చెత్తను తొలగించాలని మంగళవారం సీపీఎం నాయకులు తహసీల్దార్ కె.నాగార్జునకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండి జెడ్పీ హైస్కూల్ వెనుకనే ఉన్న డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు. కార్యక్రమంలో కొట్టాడ వెంకటేశ్వరరావు, కాలవ ఏసుబాబు పాల్గొన్నారు.

డైరీల పంపిణీ

భీమవరం: ఐఏఎల్ రూపొందించిన డైరీలు న్యాయవాదులకు, పోలీసులకు, ప్లీడర్ గుమాస్తాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. భీమవరంలో న్యాయవాదులకు డైరీల పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడారు. డైరీలో కోర్టుకు సంబంధించిన అన్ని విషయాలు పొందుపర్చారని, కోర్టు వాయిదాలు పోస్టింగ్ వేయడానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, ఐఏఎల్ నాయకులు వైవీ ఆనంద్, కామన రామకృష్ణ, అద్దంకి రాజేష్, ప్రభు పాల్గొన్నారు.

అ'పూర్వ' సహకారం అభినందనీయం

కాళ్ల: చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయడానికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని ఎంఈవో ఎ.రవీంద్ర అన్నారు. కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.58 వేలు విలువైన కంప్యూటర్‌ను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జీఎల్ఎన్ శాస్త్రి, పూర్వ విద్యార్థులు చెన్నశెట్టి దేవి వరప్రసాద్, యిర్రింకి సురేష్, కొప్పర్తి అనూష, నిమ్మల రజనీ, కొప్పర్తి నారాయణ, యాళ్ల శ్యాంబాబు, నిమ్మల ఆంజనేయులు, బేతు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, కంప్యూటరీకరణ పేరుతో ఎటువంటి శిక్షణ ఇవ్వకుండా ఉద్యోగులపై ఒత్తిడి చేయడానికి వ్యతిరేకంగా ఫిబ్రవరిలో రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె చేయనున్నట్లు సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.విజయ భాస్కర్ చెప్పారు. మంగళవారం ఈ మేరకు జిల్లా సహకార అధికారికి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పదో తేదీన డీసీసీబీలు, 20వ తేదీన కలెక్టరేట్ల వద్ద చేపట్టే ధర్నాల్లో ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

ప్రయాణికులు ఫుల్.. సౌకర్యాలు నిల్


అధ్వానంగా ఉన్న ఉండి బస్టాండ్


కాళ్లలో శిథిలావస్థకు చేరిన బస్టాండ్

- శిథిలావస్థకు చేరుతున్న బస్టాండ్లు
- కనీస సదుపాయాలు లేక ప్రయాణికుల పాట్లు
- పట్టించుకోని అధికారులు


పాడైపోయిన తాగునీటి కుళాయిలు


మూతపడిన మరుగుదొడ్లు

ఉండి: ప్రయాణికులు ఫుల్ సదుపాయాలు నిల్ ఇదీ ఉండి నియోజకవర్గంలోని బస్టాండ్ల పరిస్థితి. ఎవరేమైతే మాకెందుకు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు ఆర్టీసీ అధికారులు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉండి, ఆకివీడు, కాళ్లకు ఓ మోస్తరు బస్టాండ్లు ఉండగా పాలకోడేరు మండలం చిన్న చిన్న షెడ్లు వంటివి తప్ప బస్టాండ్ లేదు. మండల కేంద్రం పాలకోడేరులో రోడ్డు పక్కన షెడ్లు తప్ప ఓ మాదిరి బస్టాండ్ కూడా లేకపోవడం గమనార్హం. అయితే ఉండి ఆకివీడులోని బస్టాండ్లలో సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఉండి బస్టాండ్‌లోకి వచ్చిన ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు అధికారులు. తాగునీరు అవసరమైతే బస్టాండ్ బయట దుకాణానికి వెళ్లి కొనుక్కుని రావాల్సిందే. అయితే అప్పటికీ బస్సు వస్తే పరిస్థితి ఏంటని ప్రయాణికులు భయపడి దాహార్తితోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో ఉండి బస్టాండ్‌కు వచ్చేందుకు ఇష్టం లేక ఉండి సెంటర్‌లో నిలబడి ఆటోలు ఎక్కి ప్రయాణాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి నష్టం రావడంతో పాటు ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. అలాగే బస్టాండ్‌లో రోడ్ల సంగతి ఎన్నిసార్లు చెప్పినా ప్రజా ప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. బస్టాండ్‌లోని రోడ్లు పూర్తి స్థాయిలో సీసీ రోడ్లుగా మార్చాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు. ఇక అత్యవసరం అయితే మాత్రం ఇక అంతే సంగతులు. సమీపంలో కూడా ఎటువంటి మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికుల పరిస్థితి ఏంటో అధికారులే తేల్చాలి. బస్టాండ్‌లో పూర్వకాలం కట్టిన మరుగుదొడ్లే అత్యంత దుర్గంధం వెదజల్లుతూ లోనికి వెళ్లేందుకు లేకుండా అధ్వానంగా మారాయి.

సదుపాయాలు లేక ప్రయాణికుల పాట్లు


బస్టాండ్‌లో సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బస్టాండ్‌లో ఎన్నో సదుపాయాలు ఉండేవి. ఓ దుకాణం, తాగునీటి సదుపాయం, చక్కని మరుగుదొడ్లు ఉండేవి. కానీ ఇప్పుడు బస్టాండ్‌కు వెళ్లాలంటేనే ప్రయాణికులు భయపడేలా ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. – శేషాద్రి శ్రీనివాసరావు, ఉండి

నాలుగు మండలాల్లోనూ దారుణ పరిస్థితులే


ఆర్టీసీ ప్రయాణికులు అంటే ప్రజా ప్రతినిధులు, అధికారులకు చాలా చులకనగా ఉంది. దీనికి నిదర్శనం నియోజకవర్గ కేంద్రం ఉండిలోని బస్టాండ్. ఆకివీడు బస్టాండ్ పరిస్థితి కూడా సుమారుగా ఇంతే. ఇక కాళ్లలోని బస్టాండ్ అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దీంట్లోకి ప్రయాణికులు వెళ్లడమే మానేశారు. – బులుసు రామకృష్ణ, ఎన్నార్పీ అగ్రహారం

సమంజసం కాదు


ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అని ప్రచారాలు చేసే అధికారులు ప్రయాణికుల కోసం సదుపాయాలు ఏర్పాటు చేయడం మరిచారు. ఆర్టీసీకి నష్టం వచ్చినా వారు పట్టించుకోరు. ప్రయాణికులు బస్టాండ్లకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వారు ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇది సమంజసం కాదు. – జంపా నాగేశ్వరరావు, ఉండి

ఐదో కాంటూర్‌పై రైతుల అభ్యంతరం

ఉండి: కొల్లేరు అభయారణ్య ప్రతిపాదిత సున్నిత పర్యావరణ ప్రాంతంపై మంగళవారం ఉండి తహసీల్దార్ కార్యాలయంలో అటవీశాఖాధికారుల ఆధ్వర్యంలో అభ్యంతరాల స్వీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి శివాజీ ఆధ్వర్యంలో సున్నిత పర్యావరణ ప్రాంతంపై పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రాంతంలో రైతులమైన మేము 120 జీవోతో వచ్చిన ఆంక్షలతో సతమతమవుతున్నామని తెలిపారు. ఇప్పుడు ఎకో సెన్సిటివ్ జోన్‌ని ప్రతిపాదించడంతో కొల్లేరు రైతుల కష్టాలు మరింతగా పెరుగుతాయని తెలిపారు. కాగా ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమని రైతులు అభ్యంతరం తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి సుజాత, తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై స్పందించాలి

వీరవాసరం: రైతుల సమస్యలపై రెవెన్యూ సిబ్బంది తక్షణం స్పందించాలని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు అన్నారు. మండలంలోని మడుగుపోలవరంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏ చిన్న సమస్య వచ్చినా రెవెన్యూ సిబ్బందిని కలవచ్చన్నారు. సదస్సులో నాలుగు అర్జీలు వచ్చాయని వివరించారు. డీటీ సుబ్బారావు, ఆర్ఐ రూజ్‌వెల్ట్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

9న ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో పెంటపాడు డీఆర్ గోయాంక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 9వ తేదీన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో టీంలీజ్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. 18–30 ఏళ్ల మధ్య వయస్సు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 70138 96277 నంబర్‌లో సంప్రదించాలని లోకమాన్ తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలెక్టరేట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తుల విక్రయాలు

- రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రతీ సోమవారం స్టాల్ ఏర్పాటు
- నేరుగా రైతులే విక్రయిస్తున్నారు


కూరగాయలను కొనుగోళ్లు చేస్తున్న జనం

భీమవరం(ప్రకాశం చౌక్): రైతు సాధికారత సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ సంస్థలు సంయుక్తంగా కలెక్టరేట్‌లో సోమవారం ప్రత్యేక స్టాల్స్ పెట్టి ప్రజలకు ఆర్గానిక్ వస్తువులను అందిస్తున్నారు. మూడు వారాల క్రితం జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఈ ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఆర్గానిక్ కూరగాయలు, పలు రకాల బియ్యం, గోఆధారిత ఆయిల్స్ తదితరాలు విక్రయిస్తున్నారు. వాటిని పండిస్తున్న రైతులే నేరుగా వాటిని తెచ్చి విక్రయిస్తున్నారు. ఆయా సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది రైతులను ప్రోత్సహించి కూరగాయలను, ఇతర వస్తువులను తీసుకొచ్చి విక్రయించడంలో సహాయం చేస్తున్నారు.

ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్న జనం

కలెక్టరేట్‌లో అధికారుల సమక్షంలో రైతులు నేరుగా విక్రయిస్తున్న ఆర్గానిక్ కూరగాయలను, బియ్యం, ఇతర వస్తువులను జనం, అధికారులు ఉత్సాహంగా కొనుగోళ్లు చేస్తున్నారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, బ్రౌన్ రైస్, కొర్రలు, సాములు, బెల్లం, కారం, నెయ్యి, తదితర ఆహార వస్తువులు విక్రయిస్తున్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి పండించిన పంటల కాబట్టి అందరూ ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు.

కూరగాయలు బాగున్నాయి


కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం విక్రయిస్తున్న ఆర్గానిక్ కూరగాయలను తీసుకుంటున్నాను. కూరగాయలు, బొప్పాయి వంటి పండ్లు కూడా బాగున్నాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు కాబట్టి ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. – కె.దేవి, భీమవరం

స్టాల్ ఏర్పాటు బాగుంది


కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయం చేసి పండించిన కూరగాయలు, ఇతర వస్తువులను విక్రయించేలా స్టాల్ ఏర్పాటు చేయడం బాగుంది. ఇక్కడ కూరగాయలు, బియ్యం, బెల్లం, తేనే లభించడంతో వాటిని కొనుగోలు చేయడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. – ఎస్.హనుమంత్, వేంద్ర

ప్రజాదరణలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్


నూతన భవన కార్యాలయంలో బ్యాంక్ సిబ్బంది, నాయకులు

ఆకివీడు: ప్రజాదరణలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ముందుకు దూసుకుపోతుందని బ్యాంక్ ఉమ్మడి జిల్లా అధికారి శ్రీరామమూర్తి చెప్పారు. స్థానిక ఎస్ టర్నింగ్‌లోని నూతన భవనంలో కార్యాలయాన్ని కనుమూరు భరత్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 36 బ్రాంచిలు ఉన్నాయని, రూ.3,500 కోట్ల టర్నోవర్ నడుస్తుందని చెప్పారు. వెయ్యి కోట్లకు పైగా డిపాజిట్లు ఉన్నాయన్నారు. ప్రజలకు అందుబాటులో అన్ని రకాల రుణాలను సకాలంలో అందజేస్తున్నారని చెప్పారు. ఆకివీడు బ్రాంచి ఏర్పడి తొమ్మిది సంవత్సరాలైందని, రూ.120 కోట్ల టర్నోవర్, రూ.40 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని బ్రాంచి మేనేజర్ ఆర్.శ్రీహరి కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ హెడ్ మహేష్‌నాయుడు, తాడేపల్లిగూడెం మేనేజర్ వెంకట్రాజు, మోటుపల్లి ప్రసాద్, డాక్టర్లు ఎంవీఎస్.రాజు, మహేష్‌వర్మ, బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ జీవోను రద్దు చేయాలి


డీఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

భీమవరం: ఎస్సీల సోషల్ ఆడిట్ కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో 91ని రద్దు చేయాలని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఎస్సీ జనాభా లెక్కలను తాజాగా సేకరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలు హేతుబద్ధంగా లేవని తప్పులను తక్షణం సరి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టెం శుభాకర్, జీడీ కరుణాకర్, కాటిక రాజు, పిట్టా కరుణానందం పాల్గొన్నారు.

సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించాలి

భీమవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలల కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న సరెండర్ లీవ్, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ లోన్లు విడుదల చేయలేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగకు మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు కానుకగా ఇవ్వాలని కోరారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి


పెన్నాడ ఎఫ్‌సీఐలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ

భీమవరం అర్బన్: రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరం మండలంలోని బేతపూడి గ్రామంలో కమ్యూనిటీ హాలు వద్ద మంగళవారం నిర్వహించిన గ్రామసభలో జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి పాల్గొని వినతులను స్వీకరించారు. గ్రామస్తులు మంచినీటి చెరువు కలుషితమైపోయిందని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని ఫిర్యాదు చేయడంతో క్షేత్ర స్థాయిలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రావి రాంబాబు, మండల సర్వేయర్ జి.నాగబాబు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎండోమెంట్, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

బేతపూడి హైస్కూల్‌ను జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి అకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మమేకమై ముచ్చటించారు. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే కష్టపడి చదవాలన్నారు. విద్య జ్ఞానంతో పాటు సంస్కారం నేర్పుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో పాటు జేసీ సహపంక్తి భోజనం చేశారు.

బియ్యం సేకరణ వేగవంతం చేయాలి

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ ఎఫ్‌సీఐ గిడ్డంగిని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గిడ్డంగికి చేరుకున్న బియ్యం లోడులను జాప్యం లేకుండా త్వరితగతిన దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజుకు 60 వాహనాలు దిగుమతి అయ్యేలా హమాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. బియ్యం సేకరణ వేగవంతం చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఈయన వెంట సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిపో మేనేజర్ ఆనంద్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ జయశంకర్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

భీమవరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేద వృద్ధులకు మంగళవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం శాఖ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన్ వర్మ దుప్పట్లు, పంచెలు పంపిణీ చేశారు. అల్లు శ్రీనివాస్ మాట్లాడు తూ చినఅమిరం విశ్వశాంతి వృద్ధాశ్రమం కరస్పాండెంట్ భూపతిరాజు సత్యనారాయణరాజు అందించిన దుప్పట్లు, పంచెలు పంపిణీ చేశామన్నారు. గ్రంధి కుమార వెంకటేశ్వరప్రసాద్, మహేశ్వరి పాల్గొన్నారు.

12న వీవీ గిరి కళాశాల స్వర్ణోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

ఆకివీడు: పేద, గ్రామీణ విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందజేసేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్ధంగా ఉందని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు చెప్పారు. కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను ఈ నెల 12వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. 1974లో ప్రారంభించిన మొదటి బ్యాచ్ నుంచి నేటి వరకూ విద్యార్థులకు ఆహ్వానాలు అందజేశామన్నారు. ఉదయం నుండి సాయింత్రం వరకూ పూర్వ విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గొంట్లా కృష్ణమూర్తి, నేరెళ్ల రామ చెంచయ్య, గుర్రం ఈశ్వరరావు, నంబూరి వెంకట్రామరాజు (తాడినాడ బాబు), కాకర్ల రాజరాజేశ్వరి, దాసరి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం


సమావేశంలో పాల్గొన్న చైర్మన్, సభ్యులు

వీరవాసరం: రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వినియోగం, నిర్వహణ, నాణ్యత, నిధుల వినియోగం, విద్యార్థుల ప్రగతిని కమిటీ వారికి వివరించారు. జిల్లా పరిషత్ వారిచే అందజేయబడిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులతో అందజేశారు. కార్యక్రమంలో పంజా దుర్గా వెంకట గణేష్, కోడి భవాని, కోడి వెంకట విజయలక్ష్మి, దూది లక్ష్మీపార్వతి, బుడితి సౌభాగ్యవతి పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై కలెక్టర్ సమీక్ష

భీమవరం(ప్రకాశం చౌక్): జల, వాయు, భూ కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయడంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మున్సిపల్, ఇరిగేషన్, డ్వామా, ఫిషరీస్, డీఆర్‌డీఏ, టూరిజం శాఖల అధికారులతో కాలుష్య నియంత్రణపై సమీక్షించారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, సంఘ సేవకులు డి.మధుసూదనరావు ప్రధానంగా గృహాలు, వాణిజ్య సముదాయాల ద్వారా, నీటి వనరుల ద్వారా చేరుకుంటున్న చెత్త, ఆక్వా తదితర రంగాల వస్తున్న వ్యర్థ పదార్థాల నియంత్రణకు చేపట్టవలసిన చర్యలను సమావేశంలో చర్చించారు. డంపింగ్ యార్డ్ సమస్య జటిలంగా మారుతుందని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అన్నారు. రామ్‌కుమార్, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం–బత్తిలి నూతన సూపర్ లగ్జరీ బస్సును మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన బస్సు సర్వీసును ప్రయాణికులు ఉపయోగించుకోవాలని కోరారు. డిపో మేనేజర్ పి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన సూపర్ లగ్జరీ బస్సు భీమవరం నుంచి పాలకొల్లు, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, పాలకొండ బత్తిలికి తిరుగుతుందన్నారు.